

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి: రజక సంఘం నాయకులు**

**పెద్దపల్లి, ఇదే నిజం, సెప్టెంబర్ 10:** తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో రజక సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ఆమెను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన ధైర్యవంతురాలు చాకలి ఐలమ్మ అని కొనియా డారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి మహిళల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. హైదరా బాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం పెద్దమనిషి బొడ్డుపల్లి రామ్మూర్తి, గౌరవ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, 12వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డుపల్లి జగదీష్, భూతగడ్డ సంపత్, సామాజిక కార్యకర్త మంద భాస్కర్, బొడ్డుపల్లి అశోక్, కృష్ణ, రాచమల్ల సతీష్, పవనూరి లక్ష్మయ్య, గుడికందుల శ్రీనివాస్, ఎలపోతారం మొగిలి, నరసయ్య, బొడ్డుపల్లి మొండయ్య, మహేష్, శ్రీనివాస్, మధునయ్య, గండు రంగయ్య, బొడ్డుపల్లి మోహన్, ముత్తునూరి మల్లికార్జున్, శ్యాంసుందర్, పవన్, ముక్కెర రాజేశం, బొడ్డుపల్లి సంతు తదితరులు పాల్గొన్నారు.




## గాయత్రి కళాశాలలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**పెద్దపల్లి, ఇదే నిజం, సెప్టెంబర్ 10:** పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి వంటి క్రూర భూస్వాముల అరాచకాలు, దౌర్జన్యాలకు ఆమె ధైర్యంగా ఎదురు నిలిచారని తెలిపారు. తన భూమిని లాక్కోవడానికి భూస్వాములు ప్రయత్నించినప్పటికీ, తన కుటుంబ హక్కుల కోసం ఆమె బెదరకుండా పోరాడారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ చూపిన తెగువ, పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు విప్లవ స్ఫూర్తిని అందించాయని అన్నారు. విద్యార్థులు తమ హక్కులకు భంగం కలిగినప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి, హక్కుల సాధన కోసం పోరాట స్ఫూర్తిని కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ఏ. సమద్ తదితరులు పాల్గొన్నారు.



## ఆనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి అండ

**ఎల్ఓసిలను అందజేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు**

**జూలపల్లి, ఇదేనిజం, సెప్టెంబర్ 10:** ఆనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఎల్ఓసి చెక్కులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అందజేశారు. పెద్దపల్లి మండలం పెద్దకాల్వల గ్రామానికి చెందిన మద్దుల అంజయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరగా, ఆయన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల విలువైన ఎల్ ఓ సి చెక్కు మంజూరైంది. అలాగే జూలపల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన బొడ రమాదేవి వైద్య చికిత్స కోసం రూ.1 లక్ష విలువైన ఎల్ ఓ సి చెక్కు మంజూరైంది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ అసెంబ్లీ ఆవరణలో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ దివాళా దిశగా పయనం: శ్రీనివాస్ గౌడ్

**పెద్దపల్లి, ఇదే నిజం, సెప్టెంబర్ 10:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ధనిక రాష్ట్రం నుంచి తీవ్ర దివాళా దిశగా పయనిస్తోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పెద్దపల్లి పట్టణంలోని సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఏపీకి నీటి తరలింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో ఉత్తర తెలంగాణను ఎండబెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ వంటి పథకాలను నిర్లక్ష్యం చేయడంతో పాటు బీసీ సబ్‌ప్లాన్, 42 శాతం రిజర్వేషన్లు, గొర్రెల పంపిణీ వంటి హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. భూముల విషయంలో ప్రజలు, రైతులు భయపడాల్సిన అవసరం లేదని, నాయకులు లేదా అధికారులకు పర్సంటేజీలు ఇవ్వవద్దని సూచించారు.

# కులగణనతోనే బహుజనులకు న్యాయమైన వాటా..

**కేంద్రం ఓబీసీ కులగణన చేపట్టాలి : రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 10:** కులగణన ఆవశ్యకత, బీసీల భవిష్యత్తు కార్యాచరణపై పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బహుజన ప్రజాస్వామిక వేదిక అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్, మహాత్మ జ్యోతిరావు పూలే సత్యశోధక అధ్యక్షుడు ప్రొఫెసర్ కె. మురళీ మనోహర్, ప్రొఫెసర్ తిరునహరి శేషు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. వెనుకబడిన వర్గాల వారి లెక్కలు తేల్చకపోవడం వల్ల ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా, పారిశ్రామికంగా, విద్యాపారంగా ఉద్యోగ పరంగా, అనేక రంగాలలో వెనుకబడి పోతున్నామని పేర్కొన్నారు. కేంద్రం ఇప్పటికైనా డ్రాప్ డౌన్ పద్ధతిలో కుల గణన చేసి ప్రతి కులానికి క్యాస్ట్ కోడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుట్రపూరితంగానే ఓబీసీల లెక్కలు తేల్చకుండా కేంద్రం అణచి వేస్తుందని ఆరోపించారు. బీసీలు తనకు తాను బానిసత్వంలోకి లొంగిపోతూ రాజ్యాధికారం ఇతరుల చేతిలో పెడుతున్నారని వారు ఆవేదన చెందారు. బీసీలు బానిసత్వ భావజాలం విడిచిపెట్టి విముక్తి ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. బలమైన బీసీ ఉద్యమ నిర్మాణానికి తెలంగాణ నేల కదులుతుందని భవిష్యత్తు బీసీ ఉద్యమ విస్పోటంలో పెద్దపల్లి జిల్లా ఉద్యమానికి కీలక భాగస్వామ్యం కానుంది ఆశాభావం



వ్యక్తం చేశారు. తాడూరి శ్రీమన్నారాయణ స్థాపించిన బహుజన ప్రజాస్వామిక వేదిక నిర్మాణాత్మకమైన బీసీ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. కులాల వైశ్యమ్యాల తో బీసీలు అస్తిత్వాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో వెనుకబడిన వర్గాల వారి త్యాగాల వల్లనే రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు. రాష్ట్రంలో 56% ఉన్న బీసీలు రాజ్యాధికారంలో వాటా దక్కే వరకు అస్తిత్వ ఉద్యమాలు చేయవలసిందిగా పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడుగడుగున బీసీలను అణిచివేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆశపడి సామాజిక అభివృద్ధి లేకుండా ఆర్థిక అనిచి వేతకు నెట్టు వేయబడుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఉచిత పథకాలకు ఆశాజీవులుగా బీసీలు నిలిచిపోయారని అన్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ సమావేశానికి అనేక బీసీ సంఘాలతో పాటు కుల సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక రంగాలకు చెందిన బీసీలు పాల్గొని భవిష్యత్తు జన గణనలో కులగలను చేపట్టే వరకు అంకిత భావంతో ఉద్యమం చేస్తామని, ఢిల్లీ పీఠం కదిలేలా ప్రజల ఆందోళన చేస్తామని అనేక మంది వక్తలు తెలిపారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, ఓబీసీ, బీసీ కుల సంఘాల నాయకులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి, ఇదే నిజం, సెప్టెంబర్ 10:** సమానత్వానికి, వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక యోధుడు చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆదేశాల మేరకు, పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తో కలిసి, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పేదల భూముల కోసం, భుక్తి కోసం ఆమె చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారిణి, తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక



ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని అన్నారు. వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో 1895 సెప్టెంబర్ 26న ఓరుగంటి మల్లమ్మ, సాయిలులకు నాల్గవ సంతానంగా జన్మించారని, 1940-44 మధ్య కాలంలో విశ్నూర్ దేశ్ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి తెలంగాణ రైతాంగ పోరాటం చేసి విజయం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం. రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సర్వోదయ తెలంగాణ కోసం పోరాటం

- దొరల పాలనకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం ఆదర్శం : తెలంగాణ రక్షణ సేన నేతలు
- బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా వర్ధంతి వేడుకలు



**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 10 (ఇదే నిజం) :** వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సర్వోదయ తెలంగాణ సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ రక్షణ సేన నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, నవీన్ ఆచారి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం దొరల పాలనకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తమ పార్టీ చీఫ్ కవిత నాయకత్వంలో సర్వోదయ తెలంగాణ కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో దొరలు, దేశ్‌ముఖ్‌ల పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందుల తరహాలోనే ప్రస్తుతం కూడా పాలన కొనసాగుతోందని వారు విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే తమ లక్ష్యమన్నారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడతామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎత్తరి మారన్న, ఆనందం, బొడ్డుపల్లి లింగం తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నులకు

**సూడా మాజీ చైర్మన్**

**కరీంనగర్ (ఇదే నిజం) సెప్టెంబర్ 10 :** కరీంనగర్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపద్బంధువుగా నిలుస్తోందని సూడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ముకరంపురలోని తన కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. వైద్యం కోసం భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 26 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.12 లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన



ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గత 30 నెలలుగా హెల్ప్‌డెస్క్ ద్వారా దాదాపు వెయ్యి మందికి పైగా చెక్కులు అందజేసి, అండగా నిలిచామని ఆయన తెలిపారు. పేద ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సూడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.



## డీజేలకు అనుమతి తప్పనిసరి : ఎస్సై నరేందర్

**కరీంనగర్ (ఇదె నిజం) సెప్టెంబర్ 10 :** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా డీజే సౌండ్స్ నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై నరేందర్ సూచించారు. చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో డీజే సౌండ్స్ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గణపతి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా డీజే సౌండ్స్ వినియోగంపై ఉన్న నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. డీజే సౌండ్స్ కారణంగా ప్రజలకు, వృద్ధులకు, చిన్నారులకు, విద్యార్థులకు, అనారోగ్యంతో ఉన్న వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత సమయాల్లో మాత్రమే సౌండ్ సిస్టమ్స్‌ను వినియోగించాలని, అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం డీజే సౌండ్స్‌పై నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున ఎవరైనా డీజేలు ఏర్పాటు చేయాలనుకుంటే ముందస్తుగా సంబంధిత పోలీసు అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్సై సూచించారు. ముఖ్యంగా గణపతి నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేసేవారు ఏసీపీ రూరల్ నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని తెలిపారు. అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్స్ నిర్వహించడం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై నరేందర్ సూచించారు. పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని కోరారు.



## గణేష్ మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై నరేందర్

**కరీంనగర్ (ఇదే నిజం) సెప్టెంబర్ 10 :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఇది మనకు సపరేట్ సత్తా ఉండదు ఎస్సై నరేందర్ సూచించారు. చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలను వివరించారు. గణేష్ మండపాల ఏర్పాటు విషయంలో నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై తెలిపారు. పోలీసులు అందించిన లింక్ ద్వారా గణేష్ విగ్రహాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మండపాల ఏర్పాటుకు సంబంధించి అన్ని శాఖల నుంచి అవసరమైన అనుమతులు ముందుగానే తీసుకోవాలని స్పష్టం చేశారు.




## పర్యావరణ హితమే లక్ష్యం..

**విత్తన గణేష్‌కు ప్రోత్సాహం : చిర్ర రవీందర్ యాదవ్..**

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 10( ఇదేనిజం) :** గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు చిర్ర రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజనను మర్యాదపూర్వకంగా కలిసి మట్టి, విత్తనాలతో రూపొందించిన విత్తన గణేష్ విగ్రహాన్ని ఆయన అందజేశారు. గణేష్ ఉత్సవాల్లో పర్యావరణహిత విగ్రహాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నిమజ్జనం అనంతరం విగ్రహంలోని విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా ఎదిగేలా రూపొందించిన విత్తన గణేష్ ప్రకృతి పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణను కూడా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు మిద్దెల మల్లారెడ్డి, సంగారెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఐదు నెలలుగా జీతాలు లేవు

**పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల ఆందోళన**

**జూలపల్లి, ఇదేనిజం, సెప్టెంబర్, 10:** పెద్దపల్లి జిల్లా పంచాయతీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు కలెక్టర్, డీపీఓ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నెలకు రూ.22,750 జీతం పొందుతున్న తమ వేతనాన్ని రూ.19,500కు తగ్గించారని, ప్రస్తుతం ఏజెన్సీ వ్యవస్థ ద్వారా కేవలం రూ.17,400 చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఏజెన్సీ వ్యవస్థను తొలగించి ప్రభుత్వం నేరుగా తమకు నెలకు రూ.22,750కు తగ్గకుండా వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో 38 మంది, కరీంనగర్ జిల్లాలో 42 మంది, జగిత్యాల జిల్లాలో 61 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉండగా, ప్రభుత్వం 53 మందిని మాత్రమే నమోదు చేసినట్లు వారు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 40 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నట్లు వివరించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, ఉన్నతాధికారులు సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు విజ్ఞప్తి చేశారు

